క్లుప్తంగా

సాయిబాబా వార్షికోత్సవాలు ప్రారంభం



బాబాకు పూజలు చేస్తున్న భక్తులు

జి.సిగడాం: మండలంలోని ఆనందపురంలో షిరిడీ సాయిబాబా, వెంకట సాయికోటి మహాస్తూపం వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 8 రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 26న సాయికోటి నామాల పుస్తకాలను సమర్పించేందుకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున నిర్వాహకులు ఏర్పాట్లు చేఉస్తన్నారు. పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగే ఈ పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్మాత మక్క వెంకటసాయి కోరారు.

కాలభైరవ స్వామికి అభిషేకాలు



శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఆదివారం స్వర్ణాకర్షణ కాల భైరవస్వామికి విశేష అభిషేకాలు జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

హెల్మెట్ తప్పనిసరి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ జనార్దన్

గార: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఆర్.జనార్దన్ అన్నారు. ఆదివారం గార మూడు రోడ్ల జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. రోడ్డు నిబంధనలు పాటించాలని, వాహన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: మండలంలో కమ్మసిగడాం కూడలి నుంచి దేవరాపల్లి వరకు సుమారు రూ.2.10 కోట్లతో చేపడతున్న తారురోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఆదేశించారు. కమ్మసిగడాం జంక్షన్‌లో జరుగుతున్న బీటీ రోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. మహాలక్ష్మి జాతర ఫిబ్రవరి 7న జరగనుందని, ఆలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ జేఈ అప్పన్న, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు



పూజలందుకుంటున్న గాయిత్రీదేవి

ఎచ్చెర్ల : మండలంలోని కుంచాలకుర్మయ్యపేటలో గాయిత్రీదేవి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం



కళింగ డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కళింగులంతా ఐక్యతగా ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శ్రీకాకుళం శాంతి నగర్ కాలనీలోని కళింగభవన్‌లో ఆదివారం సంఘ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సూర్యం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళింగ నిరుపేదలను అందరం కలిసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కిల్లి కృపారాణి, బీజేపీ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, బుడుమూరు శ్రీరామ్మూర్తి, ఎస్.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మైదానాలకు మోక్షమెప్పుడో?

- జిల్లా కేంద్రాల్లో ఆటస్థలాలు లేక ఇక్కట్లు
- పూర్తిస్థాయి శిక్షణకు నోచుకోని క్రీడాకారులు
- ఆర్భాట ప్రకటనలకే పరిమితమవుతున్న కూటమి నాయకులు



కోడి రామ్మూర్తి స్టేడియంలో ఇంకా సన్నద్ధం కాని రన్నింగ్ ట్రాక్

శ్రీకాకుళం న్యూకాలనీ:

క్రీడల ఖిల్లాగా పేరుగాంచిన శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో మైదానాల కొరత వెంటాడుతోంది. కబడ్డీ వంటి గ్రామీణ క్రీడలు మొదలు మార్షల్ ఆర్ట్స్ వరకు అన్నింటా సిక్కోలు క్రీడాకారులు విజయ పతాకం ఎగురవేస్తున్నా సరైన ఆట స్థలాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో సీఎం కప్, ఆడుదాం ఆంధ్రా వంటి క్రీడాపోటీలతో నిత్యం క్రీడా పండగ వాతావరణం నెలకొన్న పరిస్థితుల నుంచి నేడు ఉన్న కొద్దిపాటి మైదానాలు వెలవెలబోయే స్థితికి చేరుకున్నాయి. శ్రీకాకుళం నగరంలో క్రీడాకారులకు అందుబాటులో ఉండే మూడు ప్రధాన క్రీడామైదానాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. రాష్ట్రంలో జాతీయ క్రీడలను నిర్వహిస్తామని, క్రీడలకు ఎంతో చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే కూటమి ప్రభుత్వం.. క్రీడల పట్ల, క్రీడామైదానాల పట్ల కనీస చర్యలకు ఉపక్రమించకపోవడం పట్ల క్రీడావర్గాల్లో నైరాశ్యం నెలకొంది. కూటమి పాలకుల మాటలకు, చేతలకు కనీస పొంతన ఉండటం లేదని క్రీడాకారులు బాటాహంగా ఆరోపిస్తున్నారు. క్రీడామైదానాల పట్ల అటు ప్రజాప్రతినిధులుగాని, ఇటు సంబంధిత క్రీడాకారులు, మున్సిపల్ అధికారులుగాని ప్రేక్షక పాత్ర వహిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ పెద్దలు, అధికారులు చొరవ తీసుకుని తగు చర్యలు తీసుకుని మైదానాలు ఆటలాడేందుకు వీలుగా చేయాలని క్రీడాకారులు, క్రీడాసంఘాల ప్రతినిధులు, క్రీడాభిమానులు మొరపెట్టుకుంటున్నారు.



నత్తనడకగా సాగుతున్న కోడిరామ్మూర్తి స్టేడియం పనులు



శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం మధ్య ఆటలాడేందుకు వీలు లేకుండా ఉన్న తారురోడ్డు



కార్లపార్కింగ్‌కు నిలయంగా మారిన శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణం

పనులు పూర్తయ్యేదెన్నడో?

- శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం పరిస్థితి రెండు అడుగులు ముందుకు నాలుగడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొమ్మిది నెలల్లో స్టేడియం పనులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. 8 నెలలు కావొస్తున్నా ఇప్పటికీ అతీగతీలేదు.
- శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం రన్నింగ్ ట్రాక్ అధ్వానంగా తయారైంది. క్రికెట్ కార్యకలాపాలకు సగం మైదానం కేటాయింపు కావడంతో ట్రాక్ పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. దీనికితోడు కళాశాల మైదానంలో పడమర భాగంలో రోడ్డు ఉండటంతో మైదానంలో ఆటలకు వీలు లేకుండా పోతుందని క్రీడాకారులు వాపోతున్నారు.
- శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడాప్రాంగణం ఎంతో కీర్తిని, ఖ్యాతిని చాటుకుంది. నగరంలో ప్రఖ్యాతిగాంచిన ఈ మైదానం నిత్యం కార్లపార్కింగ్‌కు నిలయంగా తయారైంది. ఒక్క వాకర్లకు బాస్కెట్‌బాల్‌కు తప్ప మరే ఇతర క్రీడలు ఆడేందుకు అవకాశం లేకుండా పోతోందని క్రీడాకారులు ఆక్షేపిస్తున్నారు.

పెదపాడు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



రోడ్డు విస్తరణ పనులు నిర్వహిస్తున్న దృశ్యం



ఎమ్మెల్యేకు సమస్య వివరిస్తున్న గ్రామస్తులు

శ్రీకాకుళం రూరల్: పెదపాడు రోడ్డు విస్తరణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. 60 అడుగుల మేర రోడ్డు విస్తరణలో భాగంగా మార్కింగ్ చేపట్టారు. ముందుగా కాలువల నిర్మాణం చేపట్టిన తర్వాత రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదే విషయమై పెదపాడు గ్రామస్తులు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. రోడ్డు మార్కింగ్ ప్రకారం చాలా వరకూ తమ ఇళ్లకు నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్, హెల్త్ అధికారితో కలిసి రెండు రోజుల కిందట పెదపాడులో పర్యటించామన్నారు. ప్రధానంగా కాలువల సమస్య ఉండటంతో వాడుక నీరు రోడ్డుపైనే పారుతోందన్నారు. ముందుగా కాలువ నిర్మాణం చేపట్టాక నిధుల లభ్యత బట్టి రోడ్డు పనులు చేపడతామన్నారు. ఈ నిర్మాణంలో భాగంగా ఎవరికి ఇంటికైనా నష్టం వాటిల్లితే కలెక్టర్ చేతుల మీదుగా ఇంటి పట్టా ఇచ్చి ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. దీనికి గ్రామస్తులంతా సహకరించాలన్నారు.

ఓవైపు పూజలు.. మరోవైపు కూల్చివేతలు



ఆదిత్యాలయం ముందు భక్తుల సందడి



ఇంద్రపుష్కరిణి సత్రం కూల్చివేస్తున్న దృశ్యం

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్యమాస ఆదివారం కావడంతో అంతరాలయంలో మూలవిరాట్టుకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేసి ఉదయం 6 గంటల నుంచి సర్వదర్శనాలకు అనుమతిచ్చారు. ఆలయ మండపంలో ఆరోగ్యం కోసం పలువురు భక్తులు సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటే.. మరికొందరు నిత్యాన్నదానానికి విరాళాలిచ్చి అన్నదాన ప్రసాదాలు స్వీకరించారు. ఇదిలావుంటే ఆలయ పరిసరాల్లో కూల్చివేత పనులు జరుగుతున్న క్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈవో వై.భద్రాజీ చర్యలు చేపట్టారు. అయినప్పటికి పలువురు భక్తులు ఇంద్రపుష్కరిణికి వెళ్లే దారిలో ఇనుప చువ్వలు తగిలి ఇబ్బందులు పడ్డారు. ఇంద్రపుష్కరిణి సత్రం భవనాలు కూడా ఆదివారం ఉదయం నుంచి కూల్చివేయడం ప్రారంభించడంతో ఆలయ ఈశాన్య ద్వారం నుంచి దర్శనాలను నిలిపివేశారు. ప్రాంగణం అంతా ధూళితో నిండిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.

చిన్నారులకు భగవద్గీత తరగతులు



భగవద్గీత పారాయణ చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని హరే రామ మందిరంలో ఆదివారం చిన్మయ మిషన్ నిర్వాహకులు పరాత్మానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో చిన్నారులకు భగవద్గీత తరగతులు నిర్వహించారు. పలు అధ్యాయాలపై అవగాహన కల్పించి శ్లోక పారాయణం చేయించారు. ప్రతి ఆదివారం బాలవిహార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, పిల్లలను ఇక్కడికి పంపించవచ్చని, వివరాలకు 9440546282, 7893931624 నంబర్లను సంప్రదించాలని చిన్మయా మిషన్ ప్రతినిధి కె.వెంకటేశ్వర్లు కోరారు.

చిన్నారులకు పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు వివిధ పోటీలు జరిగాయి. 25 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా సంస్థ వ్యవస్థాపకులు ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయక్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సాయిప్రసాద్, ఎల్.దీప్తి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి బహుమతి ప్రదానం

కూర్మనాథుని సన్నిధిలో పరమపదోత్సవం



నమ్మాళ్వర్ పరమపదోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో నమ్మాళ్వర్ పరమపదోత్సవం ఆదివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలనంతరం ముక్కోటి ఏకాదశి నుంచి పది రోజుల పాటు నిర్వహించే పరమపదోత్సవం (రాపట్టు, పగలుపట్టు ఉత్సవాలు)లో భాగంగా కూర్మనాథుని ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ ముగింపు సమయంలో ఛత్రంపై నమ్మాళ్వర్, రామానుజాచార్యుల అర్చామూర్తులు, పల్లకిపై శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి మూర్తులతో తిరువీధి నిర్వహించారు. నమ్మాళ్వర్ వైకుంఠంలో స్వామి వద్దకు చేరే క్రమంలో విష్ణుమూర్తే స్వయంగా పాల్గొన్నారని, భువిపై నమ్మాళ్వర్ ఉండాలన్న భక్తుల కోరిక మేరకు అర్చామూర్తిగా ఉండేలా సూచించడం ఈ ఉత్సవం ఉద్దేశమని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జి.గురునాథరావు, ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్ నిఘా









నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం శ్రీకాకులం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ ద్వారా నిఘా పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎన్ కాలనీ, భైరివానిపేట, కిమ్స్ ఆసుపత్రి, శాంతినగర్ కాలనీ, నాగావళి నదీ పరివాహక ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం, పేకాట, ఈవ్ టీజింగ్, చైన్‌స్నాచింగ్‌లపై నిఘా పెట్టామన్నారు. పాడుబడిన బంగ్లాలు, నివాస గృహాలను పరిశీలిస్తున్నామని, ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

– శ్రీకాకుళం క్రైమ్

అధ్వానంగా బస్‌షెల్టర్



గార మండలం కె.సైరిగాం పంచాయతీ అప్పోజీపేట (రాఘవాపురం) జంక్షన్‌లో బస్‌షెల్టర్ అధ్వానంగా మారింది. గచ్చు పెచ్చులూడి సిమెంట్ బల్లలు పాడైపోయాయి. జంక్షన్‌లో ఉండేందుకు ఎటువంటి భవనాలు, చెట్లు లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– గార

ముగిసిన దుర్గాదేవి జాతర



మధుపాం గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న దుర్గాదేవి జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

–జి.సిగడాం

సంపద కేంద్రంలో సీసాలు



గ్రామాల్లో చెత్త సేకరించి సంపద సృష్టించే కేంద్రంలో ఎరువు తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే ఎస్ఎంపురం కేంద్రంలో పొడి చెత్త, తడి చెత్త కంటే ఖాళీ మద్యం సీసాలే ఎక్కువగా కనిపిస్తుండటం గమనార్హం.

– ఎచ్చెర్ల క్యాంపస్

రణస్థలం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా గొర్లె శ్రీను



రణస్థలం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఏకాభిప్రాయంతో రణస్థలం మండల పార్టీ అధ్యక్షుడిగా గొర్లె శ్రీనివాసరావును ప్రతిపాదించినట్లు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం రణస్థలంలోని వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పార్టీలో పదవులు పొందినవారు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి పార్టీ శ్రేణులకు, ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఎలా గాలికి వదిలేశారో ప్రజలకు క్షేత్ర స్థాయిలో తెలియజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షానే నిలుస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రణస్థలం మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో యోగి వేమన జయంతి



వేమన చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, జేసీ



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: యోగి వేమన పద్యాలు ఆచరణీయమని వక్తలు పేర్కొన్నారు. తత్వవేత్త, కవి వేమన జయంతి వేడుకలను ఆదివారం శ్రీకాకుళం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ హాజరై వేమన పద్యాలు, ఆదర్శాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి సూర్యనారాయణ, చక్రవర్తి, శీర రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం క్రైమ్ : యోగివేమన జయంతి సందర్భంగా ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఆర్ డీఎస్పీ ఎల్ శేషాద్రినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు వేమన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



సక్షం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం అర్బన్: దివ్యాంగుల కోసం పనిచేస్తున్న అఖిల సంస్థ సక్షం అని, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నుంచి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని మెంటార్ నటుకుల మోహన్ అన్నారు. లయన్స్‌క్లబ్ సెంట్రల్ వేదికగా ఆదివారం క్షమతా వికాస్, అనుసంధానం మండలివారి 2025 సక్షం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సక్షం సేవల గొప్పతనాన్ని, ఉదారతను ప్రశంసించారు. సక్షం జిల్లా కన్వీనర్‌గా లయన్ డాక్టర్ ఎంకే మిశ్రా దివ్యాంగులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సక్షం జిల్లా కార్యదర్శి సీహెచ్ గణపతి, మహిళా కార్యదర్శి ఎ.రమ, జిల్లా సభ్యులు ఎస్.రమేష్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విస్తారంగా కొత్తిమీర సాగు



మెట్టపేటలో కొత్తిమీర సాగు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో అధిక విస్తీర్ణంలో కొత్తిమీర సాగు చేస్తున్నారు. పచ్చడితో పాటు కూరల్లో వినియోగం పెరగటం వల్ల కొత్తిమీరకు గిరాకీ పెరిగింది. రైతులకు మంచి ఆదాయం లభ్యం కావటంతో సాగుకు ప్రాధాన్యమిస్తున్నారు. కేశవరావుపేట, ఎస్ఎంపురం, మెట్టపేట, ఫరీదుపేట తదితర గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో రైతులకు మెరుగైన ఆదాయం చేకూరుతోంది.